www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వుల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 22 | 07-03-2022 | పుటలు : 4


## అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## మార్చి 8



ప్రాచీన కాలం నుండి నేటి వరకూ భారతీయ మహిళలు సమాజంలో ఎంతో ప్రాధాన్యాన్ని, బాధ్యతను కలిగి ఉన్నారు. భారతీయ సమాజం స్త్రీని మాతృమూర్తిగా, సోదరీమణిగా, గృహిణిగా ఆదరణ చూపి గౌరవిస్తోంది. భారతీయ మహిళ త్యాగమూర్తిగా, వినయవతిగా,విద్యావతిగా, ఆధ్యాత్మశీలిగా,వీర వనితగా నిలిచి ఆదరణ, ఆత్మీయత,అనురాగాలను సమాజానికి పంచి ప్రపంచ మహిళలకే ఆదర్శంగా నిలిచింది.

ఓరుగల్లును పరిపాలించిన రాణి రుద్రమదేవి, జాతీయోద్యమ వీరవనిత లక్ష్మీబాయి వంటి వారు భారతావనికి మణిహారాలు. అన్ని రంగాలలో మహిళలు తమదైన శక్తి సామర్థ్యాలతో సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్న సందర్భంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

# శాస్త్రజ్ఞులదే భవిత



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు

**28.02.22 (మీడియాసెల్)** విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రంపై మక్కువ పెంచాలని, శాస్త్రజ్ఞులదే భవిష్యత్తని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని యునివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, విశిష్టాతిథులుగా డా.వై.ఎస్.ఆర్.హార్టీకల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డా.ఆర్.ఎస్.వి.కె.రెడ్డి, జి.ఎన్.వి.చంద్రశేఖరరెడ్డి,నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైడ్రోలజీ సైంటిస్ట్ డా.వై.ఆర్.సత్యాజీ, సభాధ్యక్షులుగా ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి మరియు విశ్వవిద్యాలయ అధికారులు హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను సందర్శించారు. సభావేదికపై ఏర్పాటు చేసిన సర్ సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మలికిపురానికి చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు అడబాల వెంకట గంగాప్రసాద్ రచించిన “వృక్షరాజ శతకము” పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. అలాగే యూనివర్సిటీ బోటని విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన “సువాస స్టూడెంట్ క్లబ్” బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కేవలం 200 రూపాయల పరికరలతో ప్రయోగాలు చేసి నోబెల్ బహుమతి పొందిన ఘనుడు సర్ సి.వి.రామన్ అని కొనియాడారు. అటువంటి శాస్త్రవేత్తలను స్పూర్తిగా తీసుకొని విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంలో రాణించాలని అన్నారు. అధ్యాపకులు విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని, విద్యార్థులను విజ్ఞాన శాస్త్రంవైపు నడిపించాలని తెలిపారు. భారతదేశానికి నోబెల్ బహుమతులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు విజ్ఞాన శాస్త్రంపై పట్టు సాధించాలని చెప్పారు. యూనివర్సిటీలోని అధ్యాపకులు జెస్టోర్, జెగేట్ రిసోర్సెస్ ను ఉపయోగించుకొని సైన్స్ లోని మెరుగైన పరిశోధన పత్రాలను రాయాలని తెలిపారు. భూమిపై ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ భవితరాలకు వాటిని అందించి సుస్థిర అభివృద్ధిని సాధించే వారధులు కావాలన్నారు. రాళ్ళు తగిలినా, అగ్నితో కాల్చినా, గొడ్డలితో నరుకుతున్నా మొక్కలు మాత్రం మనకు ప్రాణాధారమైన ఆక్సిజన్ ను, ఫలాలను అందిస్తూ సహాయం చేస్తుంటాయని మనం కూడా సహాయం చేసే అలవాటును ప్రకృతి నుండి నేర్చుకోవాలన్నారు. పర్యావరణంలోని అనార్థాలకు మనం కారణం కాకుడదని, వాస్తవాలను సమాజానికి అందించే శాస్త్రాజ్ఞులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తరువాత డా.ఆర్.ఎస్.వి.కె.రెడ్డి, జి.ఎన్.వి.చంద్రశేఖరరెడ్డి, డా.వై.ఆర్.సత్యాజీ లు విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేస్తూ విజ్ఞాన శాస్త్రంలో పట్టుదలతో ముందుకు సాగాలని సందేశాలనందించారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఎ.పి.ఆర్.సెట్, నెట్, సెట్, జె.ఆర్.ఎఫ్, ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లును, జ్ఞాపికలను అందజేసారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్, డాక్యుమెంటేషన్, వక్తృత్వం, పెయింటింగ్, స్కిట్ కాంపిటేషన్, క్విజ్ పోటీలలో విజేతలకు జ్ఞాపికలను అందజేసారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యాధ్యక్షులు ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, సైంటిస్టులు డా.ఆర్.ఎస్.వి.కె.రెడ్డి, జి.ఎన్.వి.చంద్రశేఖరరెడ్డి, డా.వై.ఆర్.సత్యాజీ, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డీన్స్ ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య పి.సురేష్ వర్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



“వృక్షరాజ శతకము” పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

## సంపాదకీయం



# శక్తిమంతురాలు!

మహిళ బలహీనురాలనేది ఒకనాటి మాట. ఆ మాటకు కాలం చెల్లింది. మహిళ సుకుమారి, కోమలి అనే వేళ్లూనుకుపోయిన భావనను సమాజంలో కూకటివేళ్ళతో పెకలించిన ధీశాలి మహిళ. మానసిక స్థైర్యంలో ఆమెదే పైచేయి. మహిళల్లో వయసుకుమించిన మానసిక పరిణతి కనిపిస్తుంది. నాలభైమూడేళ్ల తర్వాత కానీ కొలిక్కిరాని పురుషుల్లో పరిపక్వత మహిళలల్లో ముప్పైరెండేళ్ల లోపే వస్తుందని పరిశోధనలు తెలియజేస్తున్నాయి. మెదటిని సమర్థవంతంగా వాడుకోవటంలో మహిళకు నూటికి నూరు మార్కులు వెయ్యాలి. ఇంట్లో ఉన్న కొద్దిపాటి దినుసులతో అందరికీ కమ్మని భోజనాన్ని వండి వడ్డించినట్లు అతి తక్కువ బ్రెయిన్ సెల్స్ ను ఉపయోగించి ఎన్నో పనులు చక్కబెట్టగల శక్తి మహిళది.

అసలు ఈ సృష్టిలో తొలి రైతు మహిళే అయి ఉంటుంది. బిడ్డల కడుపునింపాల్సింది అమ్మే కాబట్టి వారి ఆకలి తీర్చడానికి వ్యవసాయ ఆవిష్కర్తగా మారి ఉంటుంది. అడవిని సుక్షేత్రమైన మాగాణిలా మార్చేసి ఉంటుంది. ఆహారం కోసం పండించిన ధాన్యరాశుల్ని రాబోయే అవసరాల కోసం ఒబ్బిడి చేసి గృహంలాంటి గుహల్లో దాచేసి ఉంటుంది. ఆకలి అని పిల్లలు అరవకముందే వండి వడ్డించేసి ఉంటుంది. ఆమె పండించిన తిండి గింజలే కాలప్రవాహంలో పంట అయింది. నేల ఆస్తిగా ఎప్పుడు మారిందో నివాసాలు గ్రామాలుగా మారాయన్నమాట.

కడుపును పండించుకున్న ఆమె పంటలూ పండించింది. ఇంటిని తీర్చిదిద్దుకుంది. బహుశా పురుషుడు కడుపుమంటకొద్దీ కొన్నిటికే ఆమెను పరిమితంచేసి పెత్తనాలన్నీ తన ఆధీనంలోకి తెచ్చుకొని ఉంటాడు. రైతు అంటే మగాడు అనే అర్థాన్ని సాధించుకున్నాడు.

రైతు అంటే కర్షకురాలు అని నిఘంటువులో లేకపోయినా పొలాల్లో, పెరట్లో, కుండీలలో, మిద్దెల మీద మహిళలు ఎన్ని పంటలు పండిస్తున్నారు. మగాడు పంటలు పండించాలంటే మహిళ నాట్లు వెయ్యాలి, కలుపు తీయాలి, పంట కోయాలి. చేటతో చెరగాలి. జల్లించాలి. ఓపికగా గింజల్ని బాగు చేయాలి. ఇంటికి చేరిన తర్వాత కడిగి వండాలి, వడ్డించాలి. మరి మగాడు మట్టి మీద తనకే అధికారం ఉందంటే ఎలా?

నాలుగు ఎకరాల్లో నలభై పంటలు పండించే మహిళలున్నారు. బంగారంలాంటి భూమిలో నాలుగు కంకులు, రెన్నెలు, జొన్నలు, గింజలు పండితే నలభై తులాల నగలు కొన్నంతగా సంబరపడిపోతారు. చిరుధాన్యాలకు చిరునామాగా కనుమరుగైపోతున్న పంటల్ని మళ్లీ అందిస్తున్నవారున్నారు. మష్రుఉమ్ పండించే మహాలక్ష్ములున్నారు. చింతపండునీళ్లతో చారుకాసి అతిథుల్ని మెప్పించే చాకచక్యం మహిళ సొంతం. పైసా ఖర్చు లేకుండా ప్రకృతి సేద్యం, అంగుళం నేల వదలకుండా పుడమితల్లి ఆశల్ని మొలకెత్తించేవారున్నారు. తొమ్మిది మాసాలు బిడ్డని కడుపులో దాచుకున్న తల్లి మట్టిని కన్నతల్లిగా భావించి ఎన్నో రకాల పంటలు పండించే మహిళలున్నారు. ఇల్లు, వాకిలి, సంసారం... కేవలం వీటితోనే సరిపెట్టుకోకుండా పలుగూ పారలతో, కత్తీ కొడవళ్ళతో పొలం గట్లపై కనిపిస్తూ సమాజానికి అన్నం పెడుతూ వెలిగిపోతున్న మహారాణి మహిళ.

*భోజ్యేషు మాతా! మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తల్లీ!!*

# మనం ఆవిష్కరణలకు వారసులం

**NSTL-DRDO డైరెక్టర్ డా.వై.శ్రీనివాసరావు**


ఆవిష్కార్ 2022 ను ప్రారంభిస్తున్న అతిథులు



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డైరెక్టర్, వీసీ

ప్రాచీన భారతదేశం శాస్త్ర, సాంకేతిక విజ్ఞానంలో ఎంతో అభివృద్ధి సాధించిందని, గొప్ప ఆవిష్కరణలకు మనం వారసులమని నావిక సమర శాస్త్ర మరియు సాంకేతిక ప్రయోగశాల NSTL మరియు భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ DRDO డైరెక్టర్ డా.వై.శ్రీనివాసరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో విజ్ఞానభారతి (Vibha), భారతీయ విజ్ఞాన మండలి(BVM), ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(APCOST) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (AICTE) సహకారంతో రెండు రోజుల ఆవిష్కార్ 2022 కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఆవిష్కార్ 2022 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా NSTL-DRDO డైరెక్టర్ డా.వై.శ్రీనివాసరావు, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి ప్రవీణ్ రామదాస్, బి.వి.ఎం. సెక్రటరీ ఆచార్య జి.ఆర్.కె.శాస్త్రీ, ఎన్.ఎస్.టి.ఎల్. సైంటిస్ట్ డా.వై.వి.ఎన్.చంద్రశేఖర్, ఇస్రో సైంటిస్ట్ డా.టి.శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన భారతి నేషనల్ గవర్నింగ్ కౌన్సిలి మెంబర్ అండ్ స్టేట్ కోఆర్డినేటర్ కె.సుబ్బరాయశాస్త్రీ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.టి.ఎల్ – డి.ఆర్.డి.ఓ డైరెక్టర్ డా.వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ విజ్ఞాన ఆవిష్కరణలలో వేల సంవత్సరాల క్రితమే భారతదేశం విశ్వ గురువుగా ఉందని, ఎనిమిది వేల సంవత్సరాల క్రితమే మయాసుర ప్రతిపాదించిన వారానికి ఏడు రోజుల క్యాలెండర్ ను నేటికి ప్రపంచం అనుసరిస్తుందన్నారు. మన ప్రాచీన దేవాల యాలపై వేల సంవత్సరాల నుండి చెక్కు చెదరకుండా చెక్కబడిన శిల్పసంపద ఆర్కిటెక్చర్ వండర్ అని తెలిపారు. అలాగే రామేశ్వరంలో రామవారధి నిర్మాణంలో ఉపయోగించిన నీటిపై తేలియాడే రాళ్ళ హైడ్రోడైనమిక్స్ అప్లికేషన్ కు తార్కాణమన్నారు. దురదృష్టవశాత్తు సంవత్సరం పాటు అగ్నికి ఆహుతైన నలంద, తక్షశిల విశ్వవిద్యాలయాల్లోని విజ్ఞాన సంపద నేడు మనకు లభించడం లేదని, వాటి నుండి స్ఫూర్తి పొంది నేటి యువత నూతన ఆవిష్కరణలు కొనసాగిస్తే చైనా దిగుమతులు అవసరం ఉండదన్నారు. దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపగలిగే సామర్థ్యం గురువులకు, రైతులకు ఉందని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న వీసీ జగన్నాథరావుకు, ఆవిష్కార్ నిర్వహకులకు అభినందనలు తెలియజేసారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయవలసిన బాధ్యత గురువులపై ఉందని అన్నారు. గురువులు నూతన ఆలోచనలతో, విధానాలతో విజ్ఞానాన్ని అందించాలన్నారు. "ఔటాఫ్ బాక్స్ థింకింగ్" ద్వారా నూతన ఆవిష్కరణలు, ప్రయోగాల దిశగా విద్యార్థులను నడిపించాలని గురువులకు సూచించారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని, విద్యార్థులను ప్రోత్సహిస్తూ యూనివర్సిటీలోని ఆయా విభాగాలలో స్టూడెంట్ క్లబ్స్ ను ఏర్పాటు చేసామన్నారు. స్టూడెంట్ క్లబ్ కార్నివాల్ ద్వారా ఎన్నో ప్రోజెక్టులను విద్యార్థులు వెలుగులోనికి తీసుకువచ్చారని చెప్పారు. గురువులు విద్యార్థుల ప్రోజెక్టులను పేటెంట్ స్థాయికి తీసుకువెళ్ళేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి విచ్చేసిన శాస్త్ర, సాంకేతిక విద్యార్థులను, ఆవిష్కార్ నిర్వాహకులను అభినందించారు.

విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి డా.ప్రవీణ్ రామదాస్ మాట్లాడుతూ భారతదేశ ప్రాచీన ఆధునిక వైజ్ఞానిక వైభవం నేటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలియజేయడం ద్వారా స్వదేశీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం స్వయం సమృద్ధి సాధించేలా ప్రయత్నిస్తున్న సంస్థ విజ్ఞాన భారతి అన్నారు. భారతదేశపు స్వాతంత్రోద్యమంలో విజ్ఞాన శాస్త్రవేత్తల పాత్ర గురించి వివరిస్తూ డాక్టర్ మహేంద్రలాల్ సర్కార్ స్థాపించిన ఐ.ఎ.సి.ఎస్ సంస్థ లో చేరి పరిశోధన చేసి డాక్టర్ సి.వి.రామన్ నోబల్ బహుమతిని సాధించారని తెలిపారు. బి.వి.ఎం సెక్రటరీ ఆచార్య జి.ఆర్.కె.శాస్త్రీ, ఎన్.ఎస్.టి.ఎల్. సైంటిస్ట్ డా.వై.వి.ఎన్. చంద్రశేఖర్, ఇస్రో సైంటిస్ట్ డా.టి.శ్రీనివాసరెడ్డి విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు పయనించాలని భారతదేశాన్ని ప్రపంచ దేశంలో అగ్రగామిగా నిలపాలని తెలియజేసారు. తరువాత నిర్వహకులు అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన సైన్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కింగ్ మోడల్ కాంపిటీషన్, ఇనోవేటీవ్ ఐడియా కాంపిటీషన్, బిజినెస్ ఐడియా కాంపిటీషన్ ప్రదర్శనలను అతిథులు సందర్శించి విద్యార్థుల ప్రతిభను అభినందించారు.



సమావేశంలో మాట్లాడతున్న డా.వై.శ్రీనివాసరావు


ఆహ్వానం

నమస్సులు!

దాతలు సమర్పించిన 11 వేల గ్రంథాలతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డా. బి.ఆర్. అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో...

నన్నయ భారతి

గోదావరి జిల్లాల విజ్ఞాన అధ్యయనానికి...

నన్నయ అధ్యయన కేంద్రం

ప్రారంభోత్సవ కార్యక్రమానికి అందరికీ ఇదే మా ఆహ్వానం.

ప్రారంభోత్సవ ముఖ్యఅతిథి

ఆచార్య మొక్కా జగన్నాథరావు గారు
ఉపకులపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ప్రత్యేక అతిథులు

ఆచార్య తుపాకుల అశోక్ గారు రిజిస్ట్రార్
ఆచార్య ఎస్.టేకి గారు ఓ.ఎస్.డి.

సభాధ్యక్షులు


డా. కాకర్లపూడి రమణేశ్వరి గారు
కోఆర్డినేటర్ సెంట్రల్ లైబ్రరీ, ప్రిన్సిపాల్ సైన్స్ కాలేజ్

ది. 10 - 03 - 2022 గురువారం, ఉదయం 11.00 గంటలకు
వేదిక: డా.బి.ఆర్. అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.

ధన్యవాదములతో....

డా.తెర్లి సింహాచలం
గ్రంథాలయాధికారి

డా. తలారి వాసు
కోఆర్డినేటర్, నన్నయభారతి,
నన్నయ అధ్యయన కేంద్రం.




# గూడెం క్యాంపస్‌లో కెరీర్ అవకాశాలపై సదస్సు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం క్యాంపస్, యూనివర్శిటీ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజ్, బి ఫార్మసీ ప్రోగ్రాం ఉత్తీర్ణత తరువాత కెరీర్ అవకాశాలపై ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్లినోక్సీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు సి.ఈ.ఓ డా.సతీష్ కుమార్ వేమవరపు అధ్యక్షత వహించారు. క్లినికల్ ట్రయల్స్ మరియు పరిశోధన, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ మరియు రీసెర్చ్ ఎబిలిటీ యొక్క ప్రాముఖ్యాన్ని తెలియజేస్తూ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ షెడ్యూల్ ముగింపులో విద్యార్థులు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సెమినార్‌ను ఆర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ చైర్మన్ మిస్. ఎల్. దేవి




మరియు కో–ఛైర్మెన్ నరేంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ హీరా బట్టు, డాక్టర్ సురేంద్ర బాబు, శ్రీ నిత్యానంద రెడ్డి మరియు శ్రీమతి అరుణ నిర్వహించారు.

## మంచి మాట

"నా దృష్టిలో స్త్రీలు దుర్బలులు కారు. పురుషుల కన్నా స్త్రీలే ఉదార చరిత్రలు. నేటికిని వారే త్యాగమూర్తులు. విశ్వాసమూ, సౌజన్యము, రెండవ కంటి వారెరుగని బాధననుభవించుట, జ్ఞానము వారియందు మూర్తీభవించి ఉన్నవి"

- గాంధీజీ




## పల్లకడియంలో ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్



మెడికల్ క్యాంప్ లో మాట్లాడుతున్న డా.బి.కెజియారాణి

**05.03.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్.ఎస్.ఎస్ 1,2 యూనిట్స్ ఆధ్వర్యంలో రాజానగరం మండలం పల్లకడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్ ను నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఉచిత వైద్య సేవలను అందజేసారు. ఈ సందర్భంగా ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహంతో ఎన్.ఎస్.ఎస్. సేవల్ని ఉభయగోదావరి జిల్లాల్లో విస్తరిస్తున్నామని అన్నారు. దీనిలో భాగంగా ఏడు రోజుల ఎన్.ఎస్.ఎస్ స్పెషల్ క్యాంప్ ను ఈ నెల 2 వ తేదీ నుండి పల్లకడియం జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యా పథకాలు, కోవిడ్, వేక్సినేషన్, శుభ్రత, ఆహార నియమాలు, పోషకాహారం వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై విశ్వవిద్యాలయ తెలుగు అధ్యాపకులు డా.తలారివాసు ఉపన్యసించారని అన్నారు. పల్లకడియం గ్రామంలో విద్యార్థులచే అక్షరాస్యత, ఆరోగ్య పరిస్థితులపై సర్వే చేయించామని తెలిపారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా శనివారం పాఠశాల ప్రాంగణంలో మెడికల్ క్యాంప్ ను నిర్వహించామని మంచి స్పందన వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో పి.ఓ. రాహుల్ పాల్, సర్పంచ్ సిహెచ్.ప్రసాద్, హెడ్మాస్టర్ జి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నన్నయను సందర్శించిన సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థులు



సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థులనభినందిస్తున్న వీసీ

అకడమిక్ ఎక్చేంజ్ ప్రోగ్రామ్ – ఎన్.ఇ.పి 2020 లో భాగంగా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియోలజీ విద్యార్థులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. అకడమిక్ ఎక్చేంజ్ ప్రోగ్రామ్ లో పర్యటనను పూర్తి చేసిన విద్యార్థులను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించి వివరాలను తెలియజేసారు. విజయనగరంలోని సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ నుండి విద్యార్థులు అకడమిక్ ఎక్చేంజ్ ప్రోగ్రామ్ లో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో పర్యటించారని తెలిపారు. విద్యార్థుల మూడు రోజుల పర్యటన, వసతి ఏర్పాట్లను నన్నయ యూనివర్సిటీ జియాలజీ విభాగాధిపతి డా.కె.నూకరత్నం నిర్వహించారన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని జియాలజీ విభాగం, మ్యూజియం, డా.బి.ఆర్.అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయం, ఆయా వసతులను పరిశీలించి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారన్నారు. అలాగే లాలాచెరువు, పుణ్యక్షేత్రంలలో ఒండ్రుమట్టి పరిశీలన, రాజానగరం క్వారీలో డెక్కన్ ట్రాప్స్, నెల్లిపూడి లెఫ్టినైట్ లను పరిశీలించారన్నారు. నూతన జాతీయ విద్యావిధానంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు నూతన విజ్ఞానం అందుతుందని చెప్పారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థులు గోదావరి జిల్లాల్లో జియలాజికల్ అంశాలను తోటి విద్యార్థులతో పంచుకొని విద్యను వికసింపచేయాలన్నారు. జియాలజీలో మరింత పట్టు సంపాదించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ కు సహకరించిన వీసీ ఆచార్య టి.వి.కట్టమణి, విభాగాధ్యాపకులను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డా.కె.నూకరత్నం, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరిహారం చెక్కులు



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న వీసీ

కోవిడ్19 బారినపడి ఇటీవల మృతిచెందిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కుటుంబాలకు నష్ట పరహారం చెక్కులను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అందజేసారు. వీసీ కార్యాలయంలో చెక్కులను అందజేసిన వీసీ వివరాలను తెలియజేసారు. కోవిడ్ కారణంగా మరణించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డా.టి.వి.రమణ, ఎ.శ్రీనివాసరావు అధ్యాపకేతర సిబ్బంది ఎ.బాబురావు కుటుంబాలకు నష్టపరిహారం చెక్కులను అందించామన్నారు. ప్రతి కుటుంబానికి రూ. 2 లక్షల చొప్పున ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తరుపున అందించామన్నారు. అలాగే గతంలో మరణించిన అధ్యాపకేతర సిబ్బంది డి.ఎస్.ఆర్.ఎల్.సాంబశివరావు, పి.రాజేష్, ఎం.అర్చన, ఎస్.సత్తిబాబు కుటుంబాలకు నష్టపరిహారం అందించామన్నారు. విశ్వవిద్యాలయ సిబ్బంది అంతా ఆరోగ్యంపట్ల, కుటుంబ బాధ్యతలపట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి.ఆచార్య ఎస్.టేకి,అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బాల్యవిద్యపై సదస్సు

ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ, కాకినాడ, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మార్చి 1 నుండి 3 వరకు జాతీయ స్థాయి కంటిన్యూంగ్ రీహాబిలిటేషన్ ఎడ్యుకేషన్ (CRE) ప్రోగ్రామ్‌ను ఆన్లైన్ లో నిర్వహించారు. "బాల్య విద్యలో ప్రత్యేక విద్యావేత్తల పాత్రను పెంపొందించడం" అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య ఎస్. టేకి హాజరై ఉపన్యసించారు. బాల్యంలో విద్యావిధానాలు తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి కీలక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఇ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎం.ఎస్.ఆర్.కృష్ణారావు మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలి

## APCOST మెంబర్ సెక్రటరీ డా.పి.అపర్ణ






ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులందిస్తున్న అతిథులు

**05.03.22 (మీడియాసెల్)** ఆంధ్రప్రదేశ్ లోని విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రతిభను కనపరచాలని, శాస్త్ర, సాంకేతిక ప్రోత్సాహానికి ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పూర్తి సహకారాన్ని అందిస్తుందని APCOST మెంబర్ సెక్రటరీ డా.పి.అపర్ణ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో విజ్ఞానభారతి Vibha, భారతీయ విజ్ఞాన మండలి(BVM), ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(APCOST) ఆధ్వర్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(AICTE) సహకారంతో రెండు రోజుల ఆవిష్కార్ 2022 కార్యక్రమం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ డా.పి.అపర్ణ హాజరై ఉపన్యసించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ఆవిష్కార్ 2022 కార్యక్రమం ఎంతో విజయవంతంగా జరిగిందని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ప్రోజెక్టులను చేపట్టారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రెండు జాతీయ అవార్డులు వచ్చాయని చెప్పారు. పాఠశాల విద్యార్థుల నుండి పీజీ విద్యార్థుల వరకు ప్రతిభావంతులను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో ప్రాజెక్టులను రూపొందించారని చెప్పారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఉన్న విద్యార్థులు నిత్యం వినూత్నంగా ఆలోచించాలని తెలిపారు. సమాజహితమైన పరిశోధనలు, ప్రాజెక్టులను దేశానికి అందించాలని ఆకాంక్షించారు. తరువాత రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన సైన్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కింగ్ మోడల్ కాంపిటీషన్, ఇనోవేటీవ్ ఐడియా కాంపిటీషన్, బిజినెస్ ఐడియా కాంపిటీషన్స్ లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులను, సర్టిఫికెట్లను అందజేసారు. బిజినెస్ ఐడియా కాంపిటేషన్ లో ప్రథమ స్థానం జి.ప్రమోద్ కుమార్ (బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్ గుంటూరు), ద్వితీయ స్థానం ఎ.కుమార్, బి.రాహుల్, బాలచంద్ర(ఐఐఐటి కర్నూల్), తృతీయ స్థానం ఎస్.కౌషిక్, డి.విష్ణువర్ధన్(ఎస్.వి.యు.కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ చిత్తూరు) సాధించారు. ఇన్నోవేటీవ్ ఐడియా కాంపిటీషన్ లో ప్రథమ స్థానం కె.సాయి కుమార్, పి.సాయికృష్ణ, ఎం.రవికుమార్, కె.వర్ధన్ (సత్య ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ విజయనగరం), ద్వితీయ స్థానం జి.లలిత, పి.భార్గవిరెడ్డి(నారాయణ ఇంజనీరింగ్ కాలేజ్ నెల్లూరు), తృతీయ స్థానం జి.ప్రేమజ్యోతి, పి.షోరోన్ పుష్ప(డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ పశ్చిమ గోదావరి) కైవసం చేసుకున్నారు. అలాగే వర్కింగ్ మోడల్ కాంపిటీషన్ లో ప్రథమ స్థానం డి.నాగహరిత, కె.వి.ఎస్.అర్జున్ రెడ్డి, కె.శ్రీకాంత్, బి.రాము(శశి కాలేజ్ పశ్చిమగోదావరి), ద్వితీయ స్థానం జి.నేహమాధవ్, బి.అవంతి, సాధన పటేల్ (ఎన్.ఐ.టి ఆంధ్రప్రదేశ్), తృతీయ స్థానంలో ఎస్.కె.నైముల్లాఖాన్, వి.వెంకటేశ్వరరావు(ఎస్.ఆర్.కె.ఆర్.కాలేజ్ విజయనగరం) సాధించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన భారతి పి.ఎస్.అవధాని, స్టేట్ కోఆర్డినేటర్ కె.సుబ్బారాయశాస్త్రీ, యూనివర్సిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీలు డా.పి.విజయనిర్మల, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, డా.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


# ఫార్మా ఇండస్ట్రీలో ఉద్యోగావకాశాలను సాధించండి

ఫార్మా ఇండస్ట్రీలో ఉద్యోగావకాశాలపై విద్యార్థులు దృష్టి సారించి, తగిన సాధన చేస్తే మెండైన ఉద్యోగావకాశాలు సొంతమవుతాయని సన్ ఫార్మాసిటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అస్సాం హెడ్ డా.ఎ.మల్లిబాబు అన్నారు.యూనివర్సిటీ సెమినార్ హాల్ లో "ఇండియన్ ఫార్మాసిటికల్ ఇండస్ట్రీ ఇన్ గ్లోబల్ హెల్త్ కేర్ అండ్ జాబ్ ఆపర్చునిటీస్ ఇన్ ఫార్మ ఇండస్ట్రీ" అనే అంశంపై గెస్ట్ లెక్చర్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన సన్ ఫార్మాసిటికల్ ఇండస్ట్రీస్ హెడ్ డా.ఎ.మల్లిబాబు మాట్లాడుతూ ఫార్మా ఇండస్ట్రీలోని ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించారు. ఫార్మా ఇండస్ట్రీ వివిధ విభాగాలలో ఉద్యోగావకాశాలకు కావల్సిన అర్హతలు తెలియజేసారు. ఫార్మా ఇండస్ట్రీ వైపు ఉద్యోగావకాశాలు సాధించడానికి అవసరమైన మార్గదర్శకలను విద్యార్థులకు తెలియజేసారు. స్కిల్ డెవలప్మెంట్ కో ఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు మెరుగైన ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలోని ఆయా విభాగాలకు సంబంధించిన ఉన్నత ఉద్యోగులతో, మేధావులతో ఉద్యోగ సాధనపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా మన్నారు. వికాస సహకారంతో జాబ్ మేళాలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.ఎన్.వి.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మల్లిబాబు

# కాకినాడ ప్రాంగణంలో ఎమ్.బి.ఏ. ఐడియా ప్రోగ్రాం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎస్ఎన్ క్యాంపస్ నందు ఎంబీఏ విద్యార్థులకు ఎంటర్ప్రెన్యూర్షిప్ సబ్జెక్టుకు సంబంధించి మిలియన్ రూపీ ఐడియా అనే కార్యక్రమాన్ని ఎంబీఏ అధ్యాపకులు వై. మనోజ్ దేవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5 టీంలు గల విద్యార్థులు 10 లక్షల లోపు విలువగల బిజినెస్ లను ఐడియా రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్జీలుగా డా. ఎం పోచయ్య, డా.డి.అజయ్ రతన్, ఇ.రాధామాధవి పాల్గొన్నారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీమ్ లకు క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి బహుమతి ప్రదానం చేశారు.10 లక్షల పెట్టుబడితో ఏ విధంగా బిజినెస్ అభివృద్ధి చేస్తారనే విషయంలో విద్యార్థులు తయారు చేసిన CAP Savour అనే అనే ప్రాజెక్టు మొదటి బహుమతి గెలుచుకుంది. వీటితో పాటు మిగిలిన ప్రాజెక్టులు కూడా ఎంతగానో ఉపయోగపడతాయని ఇలాంటి కార్యక్రమాలను చేపట్టిన డిసిఎంఎస్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు మనోజ్ దేవా మరియు విద్యా ర్థులకు నన్నయ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం. కమల కుమారి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదికవి నన్నయ యూని వర్సిటీ ఎం.ఎస్.ఎన్. క్యాంపస్ కాకినాడ నందు ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ అండ్ ఎంసీఏ డిపార్ట్మెంట్ జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సి.వి. రామన్ గారి రామన్ ఎఫెక్ట్ గురించి అలాగే కే.ఏ. సైన్స్ అభివృద్ధిలో ఒక ఒక భారతీయుడు అయిన సి.వి.రామన్ ఎటువంటి కృషిని అందజేశారనే విషయాన్ని గురించి వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, డి. అజయ్ రతన్, వై.ఏసురత్నం, మహమ్మద్ నదీం,మనోజ్ దేవా , ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



## సృష్టికి మూలం స్త్రీ

సృష్టిలో ఎన్ని జీవరాసులున్నా
స్త్రీమూర్తి విలువే మిన్న
అందుకనే పరమ శివుడు
ఇచ్చాడు పార్వతికి తనలో సగభాగం
అంతేకాదు, త్యాగ నిరతిలో అంతేఎరుగని మగువకు
'యత్ర నార్యంతు పూజ్యతే, రమంతే తత్ర దేవతా' అంటూ
దేవతల స్థానమిచ్చారు
సమాజం కూడా 'ఆకాశంలో సగ'మంటుంది ఆమెను
అబల కాదు సబల అంటూ ఆమెకు ..
అన్నింటా అగ్రస్థానం ఇస్తున్నారు మన పాలకులు
ఎవరు ఏ స్థానం ఇచ్చినా, ఇవ్వకున్నా నిగర్విగానే నిలుస్తుంది
నిరంతరం తన బాధ్యతలను మరువక,
తల్లిలా లాలిస్తూ, ప్రేయసిలా ప్రేమనందిస్తూ
భార్యామణిలా బాధ్యతలను పంచుకుంటూ
పాలనాధక్షురాలిలా సుపరిపాలనందిస్తూ
తన ఇంటిని మమతల కోవెల చేసేందుకు
ఆత్మీయ, అనురాగాలను పంచుతుంది ఆమె
తీపికే చీమల బెడద అన్నట్టుగా
సహనశీలి, అమృతమూర్తి అయిన ఆమెను
కొన్ని పాడు చీమలు కామ వాంఛతో కబళిస్తుంటే
ప్రేమమాటున సర్పాలై కాటేస్తుంటే
విలవిలలాడే ఆమె హృదయం
చివరి శ్వాసలోను శాంతిని కోరుతూ
సమాజంలో మార్పు కోసం
మల్లె తీగవంటి మగువల రక్షణ కోసం
ఆరాట పడుతుంది, ఆశ పడుతుంది
బిడ్డల యోగక్షేమాలు తల్లికే ఎరుక,
అందుకనే సాటి స్త్రీమూర్తులనే అర్థిస్తుంది
'బిడ్డలను సమాజ హితులుగా తయారు చేయండి
వారిలోని చేదు ప్రవర్తనను సరిచేయండి' అని ..
అప్పుడే కదా 'యత్ర నార్యంతు పూజ్యతే... అనే పదాలకు
నిజమైన అర్థం, పరమార్థం !!

- ఎం.వి.రమణ గంధం, రాజానగరం

# నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి




## సెయింట్ థెరిస్సాలో ఘనంగా నైపుణ్య వికాసం వేడుకలు

**05.03.22 (మీడియాసెల్)** విద్యార్థులు నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని, కమ్యూనికేషన్ స్కిల్స్ సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించడం ద్వారా ఉపాధి అవకాశాలు విస్తృతం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శనివారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జరిగిన నైపుణ్య వికాస వేడుకలలో వీసీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు భాషతో పాటు ఇంగ్లీష్ భాషపై కూడా పట్టుసాధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చున్నారు. సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎంతో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నారని, 60 క్లబ్ లతో విద్యార్థుల ప్రతిభను వెలికి తీస్తున్నారని చెప్పారు. విద్యార్థినిలను ఉద్యోగ, ఉపాధి సామర్థ్యాలను పెంపొందిస్తూ, ఉన్నత ఆలోచనలతో నడిపిస్తున్నారని కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ మరియటట్ట డిమెల్లో మాట్లాడుతూ నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఆత్మస్థైర్యం పెరుగుతుందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాపరమైన అన్ని విషయాల్లో సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. కళాశాలలోని వివిధ విభాగాలను ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ సెల్, ఎగ్జామినేషన్ సెల్ ను వీసీ సందర్శించారు.వివిధ విభాగాల విద్యార్థులు ప్రదర్శించిన సృజనాత్మక విద్యా ప్రదర్శనను ఆసక్తిగా తిలకించి ప్రశంసించారు . ఆంగ్ల , తెలుగు విభాగాల విద్యార్థినిలు, అధ్యాపకులు రచించిన కవితా, కథల సంపుటాలను ఆవిష్కరించారు . అనంతరం కళాశాలలో డిగ్రీ, పీజీ విభాగాల్లో విద్యలో ప్రతిభ కనబరిచినవారికి బంగారు, వెండి పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.




# సెయింట్ థెరిస్సా విద్యార్థినుల ప్రతిభా విశేషాలు



ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in